అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



వీకర్‌సెక్షన్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అత్తాపూర్: సులేమాన్‌నగర్ డివిజన్ వీకర్‌సెక్షన్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ మహ్మద్ నవాజ్ అన్నారు. వీకర్ సెక్షన్‌లో జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ స్పష్టం చేశారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు స్థానిక వీఆర్ 4 యు అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శనివారం అల్పాహారాన్ని పంపిణీ చేశారు. మణికొండ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ట్రస్టీ ఎ.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులు మధ్యాహ్న భోజనం తరువాత సాయంత్రం 6 గంటల వరకు ఉంటుదన్నారు. వారికి సాయంత్రం 4 గంటలకు అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేసుకోగానే రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తామని ప్రకటించటంతో మిన్నకున్నామన్నారు. ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా అవి అమలు కాకపోవటంతో శనివారం నుంచి తమ సంస్థ తరఫున అందించేందుకు ముందుకు వచ్చామన్నారు. నిత్యం 210 మంది విద్యార్థులకు రోజుకో రకంగా అల్పాహారాన్ని అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి దిలీప్ కక్కడ్, సుమ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ బస్తీలో జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వెటర్నరీ విభాగం సిబ్బంది బస్తీలోని కుక్కలను పట్టుకొని తరలించారు. శుక్రవారం సుహాసిని అనే చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంగతి తెలిసిందే. దీంతో రాజేంద్రనగర్ ఉప కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ శుక్రవారం రాత్రి చిన్నారిని పరామర్శించారు. వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో బస్తీలోని వీధి కుక్కలను పట్టుకొని తరలించారు. తీసుకెళుతున్న కుక్కలను తిరిగి బస్తీలో వదలవద్దని ఈ సందర్భంగా స్థానికులు సిబ్బందికి సూచించారు.

సంపులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మణికొండ: స్విమ్మింగ్ పూల్ నిర్వహణకు నిర్మించిన సంపులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం పుప్పాలగూడలో శనివారం వెలుగుచూసింది. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... పుప్పాలగూడలోని మణికొండ స్పోర్ట్స్ ఎరెనాలో స్విమ్మింగ్ పూల్ ఉంది. దాని పక్కనే మరో సంపు ఉంది. అందులోని నీటిలో రెండు రోజులుగా దుర్వాసన వస్తుందని గమనించి శనివారం తెరిచిచూశారు. అందులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. అతని వయసు 35 నుంచి 40 ఉండవచ్చని, అతను దుస్తులు లేకుండా ఉన్నాడని స్పోర్ట్స్ ఎరెనా మేనేజర్ కిషోర్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్‌ల అభివృద్ధికి కృషి

గోల్కొండ: కమ్యూనిటీహాళ్లు, ఓపెన్ జిమ్‌ల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ, టోలిచౌకి డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బడాబజార్, రేశంబాగ్, రిసాలబజార్ తదితర ప్రాంతాల్లోని కమ్యూనిటీహాళ్లు, పాత జిమ్‌లను సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..కొంత కాలంగా బల్దియా వారు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. అదే విధంగా పేదల బస్తీలలోని కమ్యూనిటీహాళ్లల్లో కూడా సౌకర్యాల కొరత ఉందన్నారు. కార్వాన్‌లోని ఓపెన్ జిమ్‌లన్నింటినీ పరిశీలించి వాటి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే విధంగా కమ్యూనిటీహాళ్ల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూస్‌ఫరాస్, మతారూ పాషా, షకీల్ అలీఖాన్, జుబేర్ బిన్ అవద్ ఉన్నారు.

వెలగని దీపం.. నిర్వహణ దైవాధీనం..!

- పొద్దుగూకితే చిమ్మచీకటే..
- చాలా ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలు
- నిర్వహణను గాలికొదిలేసిన యంత్రాంగం
- ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- ఆందోళనలో కాలనీలు, బస్తీల్లోని ప్రజానీకం



వెలగని వీధి దీపాలతో చీకట్లో ఫోర్ట్‌వ్యూవ్ కాలనీ

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దాదాపు ఏడాదిగా పాడైన వీధి దీపాలకు మరమ్మతులు లేకపోవడం.. కొత్తగా వీధి దీపాలను బిగించకపోవడంతో రాత్రివేళల్లో బస్తీలు, కాలనీలు చిమ్మచీకట్లో మగ్గుతున్నాయి. వీధి దీపాల సమస్యను పరిష్కరించాలంటూ సర్కిల్ కార్యాలయానికి ప్రతి వారం 25కు పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఫిర్యాదులను పరిష్కరించ లేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఫిర్యాదులను స్వీకరించడం తప్ప.. తాము చేసేది ఏమీ లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అత్తాపూర్, సులేమాన్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, రాజేంద్రనగర్ ఐదు మున్సిపల్ డివిజన్లు ఉన్నాయి. ఆయా డివిజన్ల పరిధిలోని బస్తీలు, కాలనీల్లో 23,500 వీధి దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణను జీహెచ్‌ఎంసీ చూస్తుంది. ఇందుకోసం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, సిబ్బంది ఉన్నారు.
- వీధి దీపాల నిర్వహణను ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించింది. కొత్త వీధి దీపాలతో పాటు మరమ్మతులను నిర్వహించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్‌కు సంవత్సర కాలంగా బిల్లులు మంజూరు కాకపోవడం... ఇతర కారణాలతో ఆయన ఎలాంటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలోని బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు, స్థానిక బస్తీ నాయకులు చిన్నపాటి మరమ్మతులను నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు.

ఎన్ని ఫిర్యాదులు చేసినా...

వీధి దీపాల నిర్వహణపై జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంతో పాటు మేయర్‌కు సైతం ఫిర్యాదు చేశామని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ పేర్కొన్నారు. మరమ్మతులతో పాటు కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు సమర్పించాం కానీ పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని బస్తీలు, కాలనీల్లో సమస్యలు తీవ్రంగా ఉండటంతో స్వల్ప ఖర్చుతో దీపాలను ఏర్పాటు చేయించానని వెల్లడించారు.

ప్రజల ఇబ్బందులు అధికారులకు పట్టవా?

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజాల రుద్రకుమార్



కాటేదాన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ ఆరోపించారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు జి.ఎం.కురమయ్య, జి.ఎం.గట్టయ్యల అధ్యక్షతన రోడ్లు, డ్రైనేజీ మరమ్మతు చేయాలని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... కాటేదాన్ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ బుద్వేల్ నేతాజీనగర్ వెళ్లే ఓల్డ్ కర్నూలు రోడ్డులో దాదాపు 15 రోజులుగా డ్రైనేజీ నీరు డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్డు మొత్తం డ్రైనేజీ గుంతలుగా మారిందన్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ కమిషనర్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్తే అవహేళనగా మాట్లాడుతున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే శనివారం ఉదయం ఈ దారి గుండా ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ బోల్తాపడిందన్నారు. ఆటో కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. విషయం తెలుసుకొని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించామన్నారు. ఈ డ్రైనేజీని రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని ధర్నా చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పి.సి.కె. భాస్కర్, పార్టీ సభ్యులు నర్సింహ, లక్ష్మణ్, శేఖర్, మల్లేష్, రమేష్, ఈశ్వర్, నరహరి, ఇబ్రహీం, సచిన్, దత్తు, ప్రవీణ్, జాంగీర్, యూసుఫ్, అలీ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం



వాంబే కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వాంబే కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన పర్యటించారు. నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, భూగర్భ డ్రైనేజీ సమస్యలు, స్ట్రీట్ లైట్స్ తదితర సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వాంబే కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారంలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా చూడాలని అంగన్‌వాడీ టీచర్లలకు సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో చేపట్టిన వివిధ మరమ్మతు పనులు, నూతన సీసీ రోడ్డు పనులను, ఆర్‌జీకే అపార్ట్‌మెంట్ నూతన ప్రహరీ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా పనులలో ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్దిత సమయంలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహ్మామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, సచిన్, నందిని, పూజ, హనుమంత్‌రెడ్డి, మాలతి, ప్రసాద్, రఘునాథ్, అడికే శివ, పాండుయాదవ్, టి.చిన్న, అరుణ్, అండాలు, రాజేష్, రవి, ఏ.శంకర్‌రెడ్డి, సమేష్, ప్రవీణ్, అధికారులు, సిబ్బంది బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీలో కర్ణాటక విద్యార్థులు



విశ్వవిద్యాలయం ఫామ్‌లో విద్యార్థులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు శనివారం సందర్శించారు. కేంద్రీయ విద్యాలయానికి చెందిన 250 మంది విద్యార్థులు విశ్వవిద్యాలయంలోని కాలేజీ ఫామ్, మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్, పుట్టగొడుగుల పెంపకం, అగ్రి ఇన్నో హబ్‌ను పరిశీలించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వివిధ పరిశోధనలను, బోధన, విస్తరణ, కార్యక్రమాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. కాలేజీ ఫామ్‌లో చేపడుతున్న కార్యక్రమాల గురించి శాస్త్రవేత్తల పిండి సతీష్ విద్యార్థులకు వివరించారు. విశ్వవిద్యాలయ ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ వి.సుధాకర్, కేంద్రీయ విద్యాలయం అధ్యాపకులు కిష్టయ్య, విరేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మణికొండ: తలసీమియా వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిన్నారుల ప్రాణాలను నిలిపేందుకు ఆదివారం తమ కృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని అధ్యక్షురాలు పి.రూపారెడ్డి తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అత్యధికంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆమె కోరారు.

పోచమ్మ కాలనీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



మణికొండ: పోచమ్మ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శిగా బి.నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా డి.బాబు, కోశాధికారిగా ఎం.సాయిసంతోష్, ఉప కోశాధికారిగా జస్వంత్‌లను ఎన్నుకున్నారు. రెండేళ్లపాటు కమిటీ పనిచేస్తుందని అధ్యక్షుడు రాఘవరెడ్డి తెలిపారు.

కార్మికుల వేతనాలు పెంచాలి: బీఆర్‌ఎస్



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేస్తున్నారన్నారు. వారికి రెండు సంవత్సరాలుగా ఎలాంటి జీతం పెంచకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి. సీతారాం అన్నారు. వారి ఆరోగ్యం దెబ్బతిన్నపుడు ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు ఇన్సూరెన్స్, ప్రమాద బీమాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముచ్చింతల్ పాఠశాల స్థాయి పెంపునకు ప్రతిపాదన

డీఈవో సుశీందర్‌రావు



డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సందర్శించారు. పాఠశాల స్థాయి పెంపుపై స్థానికులు కొంతకాలంగా అభ్యర్థిస్తుండగా.. పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాల పరిశీలించారు. ఏడాది కిందట కృషి ఫౌండేషన్, మైహోం సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు నూతన భవనం ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించారు. పాఠశాల స్థాయి పెంపు కోసం డీఈవో సానుకూలంగా స్పందించడంతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి బోధన చేపట్టవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా డీఈవోను స్థానికులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, నోడల్ అధికారి మధుకర్, మాజీ సర్పంచ్ పెంటయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి



మహర్షి జయంతిలో పాల్గొన్న సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: శ్రీ భక్త మార్కండేయ మహర్షి జయంతిని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భావన ఋషినగర్‌లోని శ్రీ మార్కండేయ పద్మశాలీ ట్రస్ట్ భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ... ఋషి సంస్కృతి పద్మశాలీల కుల దైవమైన భక్త మార్కండేయ మహా ఋషి జయంతిని ఘనంగా నిర్వహించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. పద్మశాలీ సంఘం నాయకులు కాశీగారి యాదగిరి, ఉస్కామూరి విజయ్‌కుమార్, కొంపల్లి జగదీష్, ఏర్వ కుమారస్వామి, సామల యాదయ్య, గంజి రాజు, సిద్దిరాల రాజ్‌కుమార్, సిరిసల నారాయణ, బిర్రు రాధాకృష్ణ, కొంకటి ఆంజనేయులు, బండారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని శనివారం ప్రారంభించారు. మొదటి రోజు అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆలయ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరయ్యారు. వేద పండితులు యజ్ఞగుండం ప్రదక్షిణ చేయించి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... వైశ్యులు దానధర్మాలు చేయడంలో, గుళ్లగోపురాలు కట్టడంలో ముందు వరుసలో ఉంటారన్నారు. ఆలయ శాశ్వత చైర్మన్ మహీపతి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ నాదెళ్ల రామాంజనేయులు, ప్రెసిడెంట్ రావికంటి కిషన్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం సురేందర్, కోశాధికారి కొక్కుల వినోద్, రవికంటి వినయ్‌కుమార్, సుంకు లక్ష్మీనారాయణ, వంగేటి సురేష్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై కొరడా



దుర్గానగర్‌లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో శనివారం ఫుట్‌పాత్ ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. దుర్గానగర్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలను నిర్వహించారు. దాదాపు 160 అక్రమ నిర్మాణాలు, దుకాణాలు, డబ్బాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ మాట్లాడుతూ... చాలా మంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. వీరు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలకు నడిచేందుకు వీలు లేకుండా పోతున్నదన్నారు. దీని కారణంగానే ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఫుత్‌పాట్‌లు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినవని వాటిని అక్రమించి వ్యాపారాలు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు నోటీసులు అందించామని తెలిపారు. మరోసారి ఇలా వ్యవహరిస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని డీసీ రవికుమార్ హెచ్చరించారు.

జీఎన్‌ఐటీఎస్‌లో 'ఏ డే విత్ హెచ్‌ఆర్ లీడర్'

గోల్కొండ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనలెటిక్స్‌కు హెచ్‌ఆర్ అనుగుణంగా ఉండాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్ పర్సన్, స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌వోఐఎం రామ్‌దేవో 2025 'ఏ డే విత్ హెచ్‌ఆర్ లీడర్' కార్యక్రమం జరిగింది. విద్యా సంస్థలు పరిశ్రమలను అనుసాధించే లక్ష్యంతో జరిగిన ఈ హెచ్‌ఆర్ సమిట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానవ వనరులలో కీలకమైన ధోరణిలు, సవాళ్లను చర్చించే ఇటువంటి సమావేశాలు ఎంతో కీలకమైనవన్నారు. ఈ కార్యక్రమంలో విప్రోకు చెందిన ప్రియాంక రాయ్, ఏటోరో ల్యాబ్‌కు చెందిన ప్రతినిధి జైపాల్‌రెడ్డి, ఈవోలిస్‌కు చెందిన డాక్టర్ రీనాదాస్, డెలైట్ ప్రతినిధి ప్రేమ్‌కుమార్‌తో పాటు మాడరేటర్లు సుమన, ప్రవీణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగించొద్దంటూ..

బైక్‌ర్యాలీ.. కూడళ్ల వద్ద పోస్టర్లతో అవగాహన

రాయదుర్గం: డ్రగ్స్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ శ్రీకృష్ణయూత్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది. శనివారం ఐటీకారిడార్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, మాదాపూర్ వరకు బైక్ ర్యాలీని నిర్వహిస్తూ ఆయా కూడళ్ళలో పోస్టర్ల ప్రదర్శన చేశారు. అంతకుముందు మాదాపూర్ డీసీపీ వినీత్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపచేశారు. శ్రీకృష్ణయూత్ చొరవను ఆయన అభినందించారు. అనంతరం బయోడైవర్సిటీ కూడలి, దాబా కూడలి, రాయదుర్గం, మైండ్ స్పేస్, హైటెక్‌సిటీ, శిల్పారామం కూడళ్ల వద్ద డ్రగ్స్ వినియోగం వద్దంటూ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, నాయకులు రోహిత్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, సంగమేష్, దేవేందర్, సందీప్,గోపాల్, ఏయిజాజ్,బాబు, సంతోష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించిన డీసీపీ వినీత్

వైభవంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మణికొండ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి...

మణికొండ: మూడు రోజులుగా కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శనివారం ముగిశాయి. మణికొండ మున్సిపాలిటీ, కేపీఆర్ కాలనీలో పునఃనిర్మాణం చేసిన నాగదేవత, మైసమ్మ అమ్మవార్ల ఆలయంలో గురువారం నుంచి వేద మంత్రోశ్చరణల నడుమ ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. చివరిరోజు శనివారం అమ్మవార్లను ప్రతిష్ఠించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కొండకళ్ల వంశీయులు తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో...

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని నాగదేవత ఈదమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం హోమాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తుల నివాసాల నుంచి వచ్చిన బియ్యం, గోధుమలు, జొన్నలు తదితర వాటితో దేవతామూర్తుల విగ్రహాలకు ధాన్య దివాసం నిర్వహించారు. సాయంత్రం 108 కలశాలతో పూజలను నిర్వహించారు. రెండో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవాలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేపట్టారు.

యువ ఆవిష్కర్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలి

రాయదుర్గం: విద్యార్థుల సృజనాత్మకతకు విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు అద్దం పడతాయని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, ప్రొఫెసర్ సంజయ్‌సుభోద్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో శనివారం సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలుగా ఎదిగేలా వి ద్యార్థులను పాఠశాల స్థాయిలోనే ప్రోత్సహించాలన్నారు. చదువుతో వారు వినూత్నంగా ఆలోచించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ప్రదర్శనలో ఉంచిన 85 ఎగ్జిబిట్ల గురించి విద్యార్థులు వివరించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మిరాజ్‌ఫాతిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.